ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
మంగళవారం | 28 ఏప్రిల్, 2026 | పేజీలు :08

## ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

### నిరసనగా ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ విత్తనాలు దుకాణాలు ఒకరోజు బంద్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాష్ట్రవ్యాప్తంగా ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ డీలర్లు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా అన్ని ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ షాపులకు బంద్ ప్రకటించి నిరసన తెలిపారు. జాతీయ మరియు రాష్ట్రస్థాయి సమ్మెకు మద్దతుగా నిరసన తెలుపుతున్నట్లు జిల్లా ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ & సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రకటనలో పేర్కొన్నారు. బలవంతపు ఉత్పత్తి అనుసంధానం పై నిషేధించాలని,సబ్సిడీ ఎరువులతో పాటు సబ్సిడీ లేని ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కంపెనీలు డీలర్లను బలవంతం చేయొద్దని డిమాండ్ చేశారు. ఎరువులను నేరుగా డీలర్ వద్దకే డెలివరీ చేయాలనీ, ప్రస్తుతం రైల్వే స్టేషన్ల నుండి సరుకును తరలించడం వల్ల డీలర్లపై బస్తాకు 4050 రూపాయలు అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు. పెరుగుతున్న కూలీలు, రవాణా ఖర్చులు మరియు ద్రవ్యోల్బణం దృష్ట్యా, డీలర్ మార్జిన్‌ను కనీసం 8శాతం కు పెంచాలని కోరారు.ఈ సమ్మె నోటీసును స్వీకరించి, తక్షణ పరిష్కారం కోసం ఈ సమస్యలను రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా వ్యవసాయ అధికారిని కోరినట్లు తెలిపారు.


# పిల్లల దత్తతపై విస్తృత అవగాహన కల్పించాలి

### కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్:** శిశువులు, చిన్నారుల దత్తత విషయంలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో పిల్లల భద్రత, రక్షణ సే నో టు డ్రగ్ అనే అంశంపై నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా దత్తత అవగాహన హెల్ప్ డెస్క్ ను కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లల భద్రత సంక్షేమం కోసం చట్టబద్ధమైన దత్తత తప్పనిసరి అని తెలిపారు. ఈ సహాయ కేంద్రం ద్వారా శిశు గృహ, బాలసదనం నుండి దత్తత ఎలా తీసుకోవాలో ప్రజలకు వివరిస్తామని జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి తెలిపారు. రక్తసంబంధీకులనుండి దత్తత తీసుకున్నప్పటికీ అది చట్టబద్ధంగా ఉండాలని అన్నారు. ఏ విధమైన దత్తత ఎలా తీసుకోవాలో తెలియజేస్తూ పూర్తి సహకారం అందించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 108 దత్తతలు విజయవంతంగా పూర్తయ్యాయని, వాటిలో 6 అంతర్జాతీయ దత్తతలు ఉన్నాయని అన్నారు. దత్తతకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం ప్రజలు 1098 (చైల్డ్‌లైన్) లేదా 9490881098 నంబర్లను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, సిడబ్ల్యూసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి పర్వీన్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, డిపిఓ జగదీశ్వర్, సిడబ్ల్యూసి సభ్యులు పాల్గొన్నారు.



# సత్వరమే అర్జీల పరిష్కారం



### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన ఉప్పు కేతమ్మ 59/ఈ సర్వే నంబర్ గల ప్రభుత్వ భూమి గత 50 సంవత్సరాల నుండి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామని ప్రభుత్వ భూమిని తమ పేరు మీద పట్టా చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తాసిల్దార్ ముత్తారం కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన దిండు. స్వప్న ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి పట్టణం నల్ల పోచమ్మ వాడకి చెందిన రజియా బేగం డబల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు చదువు, ఆటల్లో రాణించాలి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** పిల్లలు చదువు.. ఆటల్లోనూ రాణించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 కార్యాచరణలో భాగంగా బాలల భద్రత.. డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాలు తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మహిళా, శిశు, దివ్యాంగులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు ఆటల పరికరాలు, వాలీ బాల్ లు పంపిణీ చేశారు. బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థుల నృత్యం ఆలోచింపజేసింది. అంగన్వాడీ కేంద్రానికి పిల్లల ఎందరు వస్తున్నారు? రోజు పోషకాహారం ఇస్తున్నారా కలెక్టర్ ఆరా తీశారు? షి టీమ్ నంబర్ 87126 56425, మిషన్ వాత్సల్య, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, టెలీ మానస్ 14416 హెల్ప్ లైన్ పై వివరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు.వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. పిల్లల భద్రత.. అభివృద్ధి బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లదని పేర్కొన్నారు. పిల్లలు నిర్భయంగా మాట్లాడాలని తెలిపారు. తమకు నచ్చిన ఆటలు ఆడాలని, కచ్చితంగా చదవాలని తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. వేసవి సెలవుల్లో ఇంట్లో తల్లికి సహాయం చేయాలని, తండ్రి వృత్తిని పరిశీలిస్తూ.. సహాయం చేయాలని వివరించారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం చేయాలని, ఏదైనా కొలువు సాధించాలని ఆకాంక్షించారు. ఎక్కువ శాతం హెల్మెట్ లేకుండా వెళ్తుండడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. తమ ఇంట్లో ద్విచక్ర వాహనం ఉన్న వారు హెల్మెట్ ధరించి బయటికి వెళ్లేలా.. కుటుంబ సభ్యులు సూచించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రాచారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ రాజం,జిల్లా వైద్యాధికారి రజిత, విజయ్ ప్రకాశ్ రావు, ఎంపీడీఓ లక్ష్మి నారాయణ, సర్పంచ్ సాగర్, ఉమారాణి పాల్గొన్నారు.



# స్వీయ గణనలో అందరూ బాధ్యతగా పాల్గొనాలి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** జనగణనలో భాగంగా చేపట్టిన స్వీయ గణనలో అందరూ బాధ్యతగా పాల్గొనాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శివకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్ కోర్టు కాంప్లెక్స్ లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి స్వయంగా ఆన్లైన్ ద్వారా వివరాలు నమోదు చేసుకుని స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ మాట్లాడుతూ, జనాభాగణన కీలక జాతీయ కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమం దేశంలోని జనాభా వారి, సామాజిక ఆర్థిక పరిస్థితులపై సమగ్ర సమాచారం అందించడంతోపాటు సమర్థవంతమైన ప్రణాళిక అమలుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలోని ప్రజలంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములై స్వీయ గణన చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శ్రీనివాస్ జిల్లా సెన్సెస్ ఇన్చార్జి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనులు ప్రారంభించిన సర్పంచ్



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలంలోని కందునూరిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ శైలజ అంజన్న ఉప సర్పంచ్ మహేష్‌తో కలిసి ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడం వలన తగు జాగ్రత్తలు పాటిస్తూ పనులు నిర్వహించాలని ఉపాధి హామీ కూలీలకు సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సుస్మిత, విజయ, మమత, జ్యోతి, సమ్మక్క, రవీందర్, ఓదెలులతో ఉపాధి హామీ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:**సుల్తానాబాద్ మండల తహసిల్దార్ బషీరుద్దీన్ గో సమ్మన్ అభియాన్ ఆధ్వర్యంలో గోమాత ను జాతీయ జంతువుగా ప్రకటించాలని ,సంపూర్ణ గోహత్య రూపుమాపుటకు చట్టం తీసుకురావాలని వినతి పత్రాన్ని గోమాత సంరక్షకులు అందజేశారు. గో సేవా కొరకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయవలసిందిగా కోరుకుంటూ సుల్తానాబాద్ మండల తహసిల్దార్ ద్వారా ,జిల్లా కలెక్టర్ తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రి కి గవర్నర్ కు,భారత దేశ ప్రధాన మంత్రి కి,రాష్ట్రపతి కి వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ ధర్మశాస్త్ర గోశాల అధ్యక్షులు బండారి సూర్య, కొమరవెల్లి శ్రీధర్, తుమ్మ రాజ్ కుమార్ ,సాదుల కరుణాకర్,తిరుపతి రెడ్డి ,అశోక్,గంగాధర్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లలకి 'ఆఫ్టర్ కేర్' ఒక వరం

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** అనాథ పిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే 'ఆఫ్టర్ కేర్' కార్యక్రమం ఒక గొప్ప వరం అని గర్జనపల్లి సర్పంచ్ రాకేష్ గౌడ్ అన్నారు. సోమవారం గ్రామంలోని అంగన్వాడీ మొదటి కేంద్రంలో 99 రోజుల ప్రజాపాలనలో భాగంగా పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న పిల్లల ఉన్నత విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు వారికి పూర్తి స్థాయిలో అందేలా ఈ ఆఫ్టర్ కేర్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే యువత మాదక ద్రవ్యాలకు, హానికరమైన అలవాట్లకు దూరంగా ఉండాలని, దీనిని ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటేష్, అంగన్వాడీ కార్యకర్త రమాదేవి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్, ఆశ కార్యకర్త సావిత్రి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆధునిక సాగుతోనే రైతులకు ఆర్థిక పురోగతి



**ప్రజాపక్షం/జమ్మికుంట:** రైతులు సంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి, ఆధునిక శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారానే ఆర్థికంగా బలోపేతం కాగలరని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం పేర్కొన్నారు. సోమవారం జమ్మికుంటలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సు కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి రసీదులు పొందాలని సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, ఫలితాల ఆధారంగానే ఎరువుల వినియోగం ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు పంట మార్పిడి ప్రాముఖ్యతను వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, సంక్షేమ పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు జమ్మికుంట లో పరిసర ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

## భూ అక్రమాలపై దళిత నాయకుడి ఆగ్రహం



**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పోతారం గ్రామంలోని సర్వే నంబర్ 59లో జరుగుతున్న భూ అక్రమాలపై మంథని డివిజన్ దళిత నాయకుడు ఊట్ల శ్రీను తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం నాడు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బాధితులతో కలిసి ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఊట్ల శ్రీను మాట్లాడుతూ పోతారం గ్రామంలోని సర్వే నంబర్ 59లో గత 80 ఏళ్లుగా (తాతల కాలం నుండి) సుమారు 48 మంది దళిత, వెనుకబడిన తరగతుల రైతులు భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో భూమిని సాగు చేస్తున్న అసలైన అర్హులకు పట్టాలు ఇవ్వకుండా, అక్కడ భూమి లేని అపరిచితులకు అధికారులు అక్రమంగా పట్టా పాస్ బుక్కులు జారీ చేయడం అత్యంత హేయమైన చర్య" అని విమర్శించారు.అధికారులు ఇంత హీనంగా దిగజారి, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే పట్టాలు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు.ఈ విషయంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్, మంథని ఆర్డీవో, ముత్తారం తహసీల్దార్ వెంటనే చొరవ తీసుకుని విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గత ఎనిమిది దశాబ్దాలుగా భూమిని నమ్ముకుని బతుకుతున్న 48 మంది పోతారం గ్రామ రైతులు పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

## ప్రమాదం అంచున ప్రయాణం



**ప్రజాపక్షం/గంగాధర:** వాహనాలు రాకపోకలు సాఫీగా సాగించాలంటే మార్గం సజావుగా ఉండాలి. రోడ్డుపై ఎటువంటి అవాంతరాలు లేకుండా ఉంటేనే ప్రమాదాలకు ఆస్కారం ఉండదు. గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామం నుంచి జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. బూరుగుపల్లి కల్లు మండువ దగ్గర గల వంతెన పక్కకు బిటీ రోడ్డు అంచు చాలా వరకు కూలిపోయి ప్రమాదకరంగా మారింది. ఆదమరిచి వాహనం నడిపితే ఇక అంతే అన్న చందంగా ఉంది. రాత్రి వేళల్లో వాహనదారులు రహదారి వెంట వెళ్లాంటే ప్రాణాన్ని గుప్పిట్లో పెట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. నిత్యం బూరుగుపల్లి నుంచి మల్యాల వరకు అనేక మంది వాహనదారులు ఈ మార్గం గుండానే ప్రయాణం సాగిస్తుంటారు. దీంతో పాటు అనేక ప్రమాదకరమైన మూల మలుపులు ఉన్నాయి,. చెట్టులు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. రోడ్డు వెంటా సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కూలిన రోడ్డును బాగు చేసి , మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

**ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?**

బత్తిని విజయ్ గౌడ్ వాహనదారుడు

బూరుగుపల్లి నుంచి మల్యాలకు వెళ్లే దారిలో కల్లు మండువ బ్రిడ్జి దగ్గర రోడ్డు కోతకు గురై ప్రమాకరంగా ఉంది. నిత్యం స్కూల్ వ్యానులు, బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రయాణిస్తుంటాయి. ప్రమాదం జరిగి ప్రాణాలు పోతే ఎవరు బాద్యులు?, ఇప్పటికైనా ప్రమాం జరగకముందే పాలకులు సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలి. రహదారి వెంట ఇరువైపులా చెట్ల కొమ్మలు తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

## సీతంపేటలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'



**ప్రజాపక్షం/ముత్తారం:** మండలంలోని సీతంపేట గ్రామంలో సోమవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. జగిత్యాల జిల్లా పోలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుండి శాస్త్రవేత్తలు డా. టి. అర్చన (వ్యవసాయ విస్తరణ విభాగం), డా. రమేష్ (కీటక విభాగం) విచ్చేసి రైతులకు సాగుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, పంటలలో ఎరువుల అధిక వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు.భూసారాన్ని కాపాడుకుంటూ, అవసరమైన మేరకే ఎరువులు వాడే విధానాన్ని రైతులకు తెలియజేశారు. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న,మిరప పంటలను ఆశించే చీడపీడలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి శాస్త్రవేత్తలు కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఇ. నవీన్, మండల వ్యవసాయ అధికారి జె. అనూష,వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. శ్రీలేఖ,గ్రామంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సత్యం గౌడ్ కుటుంబానికి బిఆర్ఎస్ నేత అండ

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** బాధలో ఉన్న కుటుంబానికి ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి ఆదుకునేందుకే 'విహెచ్అర్' ఫౌండేషన్ ఉందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి అన్నారు.ఈ మేరకు గత కొన్నేళ్ల నుంచి మానవసేవే మాధవసేవ పరమావధిగా ప్రతి ఒక్కరికి సేవ చేస్తూ ఆపదలో ఆదుకుంటున్నారు వ్యాల్ల హరీష్ రెడ్డి. వీహెచ్ఆర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇదే క్రమంలో రామగుండం నియోజకవర్గం పరిధిలోని పాలకుర్తి మండలం పుట్నూర్ గ్రామానికి చెందిన పడాల సత్యం గౌడ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక కాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న గులాబీ నేత వెంటనే ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్న వారి వెంటే ఉంటానంటూ గత కొన్నేళ్లుగా అన్ని వర్గాల ప్రజల తలలో నాలుకగా మెదులుతున్నారు.ఆయన వెంట పుట్నూరు గ్రామ ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ఫౌండేషన్ ప్రతినిధులు,సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనగామ డివిజన్ లో దొంగల హల్ చల్

## తాళాలు వేసిన ఇండ్లలో దొంగతనాలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరవ డివిజన్ జనగామ లో దొంగల సందడి మొదలైందని, దొంగ తనాల నివారణకు పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు.జనగామ డివిజన్ లో గత కొద్ది రోజులుగా దొంగలు తాళాలు వేసిన ఇండ్ల లోని విలువైన సామాన్లు మాయం చేస్తున్నారని, ముఖ్యంగా ఇత్తడి సామానులు, గ్యాస్ సిలిండర్ లు చోరికి గురి అవుతున్నాయని ఆయన తెలిపారు. ఇప్పటికీ నాలుగు ఇండ్లలో చోరీలు జరిగాయని, బాధిత కుటుంబాలు దొంగ తనాల పై 8వ కాలనీ లోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని, దీని పై పోలీసులు కూడా డివిజన్ కు వచ్చి విచారణ జరిపారని,దొంగల ఆచూకీ లభించలేదని, ఐనా దొంగ తనాలు ఆగడం లేదని ఆయన అన్నారు. జనగామ డివిజన్ పోలీస్ స్టేషన్ కు చాలా దూరంగా ఉండటం తో బాధిత కుటుంబాలు ఎవరు ఫిర్యాదు చేయరనే ఆలోచన తో దొంగలు ఈ ప్రాంతాన్ని దొంగతనాలకు ఎంచుకున్నట్టు ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. డివిజన్ లో సి సి కెమెరాలు ఉన్నా అవి పని చేస్తున్నాయో లేదో తెలియడం లేదని, అవి పని చేసే విధంగా లేని చోట సి.సి కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా, దాంతో పాటు పోలీసు పెట్రోలింగ్ ను ఏర్పాటు చేసి డివిజన్ లో దొంగతనాల నివారణ కు చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసు అధికారులను కోరారు.అదే విధంగా ఆరవ డివిజన్ జనగామ ను టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు మార్చాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటన లో కోరారు.

## ట్రాక్టర్ ఇంజన్‌లో మంటలు

### తృటిలో తప్పిన ప్రాణాపాయం

**ప్రజాపక్షం /కొడిమ్యాల :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామంలో ఒక ట్రాక్టర్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగి వాహనం పూర్తిగా కాలిపోయింది. స్థానికుల సమాచారం ప్రకారం, నమిలకొండ గ్రామానికి చెందిన ఇటుక బట్టీల నుండి వేములవాడ వైపు ఇటుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ నల్లగొండ గ్రామానికి చేరుకోగానే ఇంజన్‌లో పొగలు రావడం గమనించిన డ్రైవర్ వెంటనే రోడ్డు పక్కన ఆపాడు. అయితే క్షణాల్లోనే మంటలు వ్యాపించి ట్రాక్టర్ మొత్తాన్ని చుట్టుముట్టాయి. అక్కడికక్కడే మంటలు చెలరేగడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది.అదృష్టవశాత్తూ డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.ఈ ఘటనను చూసిన గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా పూర్తిగా తెలియాల్సి ఉంది.

## పనులు ఫుల్ జీతాలు నిల్

### ప్రజావాణిలో పారిశుద్ధ్య కార్మికుల ఫిర్యాదు

**ప్రజాపక్షం/కొడిమ్యాల :** కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి గ్రామంలో పనిచేస్తున్న సఫాయి కార్మికులకు గత 15 నెలలుగా జీతాలు చెల్లించలేదని పేర్కొంటూ సోమవారం పారిశుద్ధ్య కార్మికులు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.గత 13 సంవత్సరాలుగా గ్రామంలో సేవలు అందిస్తున్నప్పటికీ ప్రత్యేక అధికారి పాలన నుంచి ఇప్పటివరకు జీతాలు అందలేదని తెలిపారు. గ్రామ సెక్రటరీ, కారొబార్‌లను పలుమార్లు సంప్రదించినా 'ట్రెజరీలో నగదు లేదు' అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎంపీడీఓ, ప్ర జా ప్రతినిధులను కలిసినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొంటూ, పెండింగ్ జీతభత్యాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులు రొడ్డ రాయమల్లు, కనికరపు సత్తయ్య,చిర్ర దేవ య్య, చిర్ర మల్లయ్య తదితరులున్నారు.

## నృసింహుడికి చందనోత్సవం

**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న నరసింహ నవరాత్రోత్సవాలలో భాగంగా 6వ రోజు సోమవారం శ్రీ యోగనంద (పాత), శ్రీ ఉగ్ర (కొత్త) నృసింహ స్వామి వారలకు చందనోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం శ్రీ స్వామివారికి పురుష సూక్త,శ్రీసూక్త, కల్పోక్త,న్యాసకపూర్వక షోడశ ఉపచార పూజ, సహస్ర నామార్చన, పంచోపనిషత్తులతో మన్యసూక్తము, రుద్రాభిషేకం పూజలు, సప్త హారతులు, భజన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం భారీ సంఖ్యలో హాజరైన భక్తులకు తీర్థప్రసాదాల వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్, దేవస్థానం మాజీ అధ్యక్షులు జక్కు రవీందర్,ప్రముఖ పౌరాణిక ప్రవచకులు బాచంపెల్లి సంతోష్ కుమార్ శర్మ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరేళ్ల శ్రీనివాసచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసచార్యులు,సీహెచ్ రమణయ్య, కళ్యాణ్, విజయ్, అరుణ్, వంశీ, సూపరింటెండెంట్ కిరణ్,సీనియర్ అసిస్టెంట్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గోవుల సంరక్షణ చట్టాన్ని తేవాలని వినతి

**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ గో సమ్మాన్ అభియాన్ రాయికల్ ఆధ్వర్యంలో గోవుల సంరక్షణ చట్టం ప్రవేశపెట్టాలని సోమవారంతహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా నిలిచిన దేశీయ గోవుల జాతి సంప్రదాయాల నిరంతర ప్రవాహమని మన గొప్ప సాంస్కృతిక వారసత్వ పోషణ ఎల్లప్పుడూ గోవుల సమీపంలో వర్ధిల్లిందని అన్నారు. తెలంగాణ గొప్ప జానపద సంస్కృతి, దాని చారిత్రక పండుగలు, వ్యవసాయ ఆధారిత జీవనవిధానం గోమాత లేకుండా అసాధ్యమని, అలాంటి గోమాతలను అన్యాయంగా కళేబరాలకు తరలిస్తూ గోవుల పశుసంపద తరుదలకు అనేక



రకాలుగా కొందరు పనిచేస్తున్నారనిఅన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే గో రక్షణ చట్టాన్ని ప్రవేశ పెట్టి చట్టం తేవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ తురగ రాజారెడ్డి ,సామల సతీష్, ఎనగందుల రమేష్ ,కాయితి గంగాధర్,శంకర్ జి, శైలంధర్,తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

**ప్రజాపక్షం/కొడిమ్యాల :** సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పుణుగోటి కృష్ణారావుగ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని సిబ్బంది వేతనాలు చెల్లించాలని మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పుణుగోటి కృష్ణారావు తెలిపారు. సోమవారం మండలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సాధారణ నిధుల నుంచి జారీ చేసిన చెక్కులు గత 18 నెలలుగా తిరస్కరించబడుతున్నాయ, ఇంటి పన్ను ద్వారా చెల్లించిన వేతనాలు కూడా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ కారణంగా 15వ ఆర్థిక సంఘం నిధులను వేతనాలకు వినియోగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.ఆదాయం కంటే వేతన



భారం ఎక్కువగా ఉండటంతో పంచాయతీలు చెల్లింపులు చేయలేకపోతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసి సిబ్బంది వేతనాలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అనసూర్య, అయిలయ్య, మాజీ సర్పంచులు మహిపాల్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘ భవనాలకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/పెగడపల్లి :** మండలంలోని అయితుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి పాలకవర్గం, గ్రామ సర్పంచ్ మేకల అంజమ్మ మల్లయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మంగళవారం గ్రామ పంచాయతీ ప్రతినిధులు, అధికారులు కలిసి భవన నిర్మాణ స్థలంలో శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించి, ముగ్గు పోసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ఈ భవనాలు వేదికలుగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఎమ్ రవి వర్మ,సిసి శశికుమార్,ఉప సర్పంచ్ గోలి సంజీవరెడ్డి, పంచాయతీ కార్య



దర్శి మంజుల పాల్గొన్నారు. వార్డు సభ్యులు హసీనా రజాక్, రమ,గంగాధర్,సరోజన,వెంకట్ రెడ్డి, కుమార్, నవీన్ లతో పాటు గ్రామంలోని మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. మహిళా సంఘాల సభ్యులు ఒకచోట చేరి చర్చించుకోవడానికి,శిక్షణలు పొందడానికి ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని వారు కొనియాడారు.

# విద్యుత్‌లో వోల్టేజీ సమస్య పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో లోవోల్టేజీ వల్ల గృహోపకరణాలు చెడిపోతున్నాయని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్తు ఉపకేంద్రంలో ఏఈఓ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాజపా పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ మాట్లాడుతూ ధర్మపురి పట్టణంలో ఇటీవల లోవోల్టేజీ సమస్య కారణంగా ఇళ్లలోని ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, ఎయిర్ కండీషనర్లు తదితర గృహోపకరణాలు చెడిపోవడం వల్ల ప్రజలు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ప్రమాదాలు కూడా జరిగే అవకాశాలు ఉండటంతో భయాందోళనల మధ్య జీవనం సాగిస్తున్నారని తెలిపారు. విద్యుత్ యంత్రికల సామర్థ్యాన్ని క్రమబద్ధీ



కరించి లోవోల్టేజీ సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని భాస్కర్ కోరారు. కార్యక్రమంలో గాజు భాస్కర్, జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవన్, పట్టణ ప్రధాన కార్యదర్శి టి. సత్యనారాయణ, నాయకులు సూరజ్, రాజు, పవన్ కుమార్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తాం

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని రాఘవపేట గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ అన్నారు.ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కృషితో గ్రామానికి చెందిన లబ్ధిదారులైన బండి అంజమ్మ కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. వెనువెంటనే పనులను పూర్తి చేయాలని సమస్యలు వస్తే దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సహకారంతో పరిష్కరిస్తామని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఓ సర్పంచ్ మద్దెల నరసయ్య వార్డు సభ్యులు ఎండి ఆమీన్,



సాగర్ లక్ష్మి నరసయ్య, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సుద్దు రాజ్ కుమార్,నాయకులు రాములు,రమేష్ ,శేఖర్, శ్రీనివాస్ ,రాజేష్ ,మల్లేష్, రజినీకాంత్, లబ్ధిదారులు ఉన్నారు.

## జనగణన పకడ్బందీగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/పెగడపల్లి :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనగణన2027 ప్రక్రియపై ఎన్యూమరేటర్లు మరియు సూపర్ వైజర్లకు సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు సమావేశ ఉద్దేశ్యాన్ని వివరిస్తూ జాతీయ ప్రణాళికలు, విధాన రూపకల్పనలో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. శిక్షణలో భాగంగా జనగణన పద్ధతులు, ముఖ్య లక్షణాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ముఖ్యంగా డేటా సేకరణలో ఖచ్చితత్వం పాటించాలని, ప్రతి ఇంటి వివరాలను నిష్పాక్షికంగా నమోదు చేయాలని సూచించారు. ఎన్యూమరేటర్లు మరియు సూపర్ వైజర్లు క్షేత్రస్థాయిలో పని చేసే విధానం గురించి డిజిటల్ స్క్రీన్ల ద్వారా వివరించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నిజామొద్దీన్, మండల విద్యాధికారి సులోచన, ఏఎస్ఓ సురేష్, ఆ రైలు శ్రీనివాస్,జమున,మండల స్థాయి అధికారులు,శిక్షకులు మరియు నియమించబడిన సిబ్బంది పాల్గొన్నారు.

## నేడే ఎస్సీ కార్పొరేషన్ రుణాల మౌఖిక పరీక్షలు

**ప్రజాపక్షం /పెగడపల్లి :** పెగడపల్లి మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల నుండి 202526 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్సీ కార్పొరేషన్ (ఎస్‌సిఎసి) రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ప్రేమ్ సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## స్వర్ణ దేవాలయంలో మంత్రి అడ్లూరి పూజలు

**ప్రజాపక్షం/ధర్మపురి :** పంజాబ్ రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అమృత్ సర్ లోని స్వర్ణదేవాలయాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఆదివారం హర్యానాలోని చండీగఢ్ లో చింతన్ శివర్ కార్యక్రమాన్ని ముగించుకుని అమృత్ సర్ చేరుకున్న మంత్రి అడ్లూరి ముందుగా గురుద్వారాలోని పవిత్ర సరస్సులో స్నానము చేసి స్వర్ణ దేవాలయంలోని గురుగ్రంథ్ సాహిబ్‌కు భక్తితో ప్రార్థనలు నిర్వహించారు.

## వేముల కుర్తి యువతి పెంట భానుశ్రీకి ఎంబిబిఎస్ పట్టా

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం వేములకుర్తి గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి పెంట లక్ష్మి–లింబద్రి దంపతుల కుమార్తె పెంట బానుశ్రీ ఎంబీబీఎస్ పట్టా పొందారు.అదిలాబాద్ రిమ్స్‌లో ఆమె వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేశారు.ఆదివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ వేడుకలో గౌరవ అతిథుల చేతుల మీదుగా డిగ్రీ అందుకున్నారు. విద్యలో చూపిన పట్టుదల, అంకితభావానికి అధ్యాపకులు ప్రశంసలు కురిపించారు. తన కుమార్తె విజయంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి పేదలకు సేవ చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. బానుశ్రీ విజయాన్ని గ్రామస్తులు, డాక్టర్లు,స్నేహితులు అభినందించారు.

## హిందు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/రాయికల్ :** మంగళవారం రోజున రాయికల్ శిశు మందిర్ పాఠశాల ప్రాంగణంలో సాయంత్రం 530 నుండి రాత్రి 930 ని ల వరకు జరుగున్న హిందు సమ్మేళనం కార్యక్రమానికి హిందూ బంధువులు అత్యధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయవలసిందిగా నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ శ్రీ శ్రీ రాధ మనోహర్ దాస్ ,అభయ హిందు సేన ఫౌండర్,ప్రముఖ ప్రధాన వక్తా జిన్నా సత్యనారాయణ తెలంగాణప్రాంత వికాస్ ప్రముఖ్, ముఖ్య వక్త మచ్చ జోత్స్నా లు హాజరుకానున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం ,భజన సంకీర్తనలతో పాటు గోపూజ కార్యక్రమం కూడా ఉంటుందని అనంతరం అన్నదానం కలదని హిందూ బాంధవులు భారీగా తరలి రాలవాలని విజ్ఞప్తి చేశారు.

## కబ్జాదారుల నుండి ప్రభుత్వ భూమిని పరిరక్షించండి



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** అక్రమంగా ప్రభుత్వ భూమి కబ్జా చేసి పట్టచేసుకున్న అక్రమార్కుల నుండి భూమి ని పరిరక్షించాలని పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కు,ఆర్డీవోకు కనుకుల, రామునిపల్లి గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామంలోని సర్వే నెంబర్ 221 ప్రభుత్వ భూమి 100 ఎకరాలు కలదు. అందులో నుండి 11 ఎకరాల 31 గుంటలు ప్రభుత్వ భూమిని జిన్నా శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి ప్రభుత్వ భూమిని పట్టా చేయించుకున్నాడు అని జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశారు.నాలా కింద దీని పట్ల ఈ భూమి మూడు గ్రామాలకు సంబంధించిన ప్రజల అవసరాల కొరకు ఉండాలని కలెక్టర్ కు ,ఆర్ డి ఓ కు కనుకుల సర్పంచ్ కర్రే కవిత కుమార్ ,రాముని పల్లి సర్పంచ్ సుబ్బని అనసూయ రాయమల్లు జిల్లా కలెక్టర్, ఆర్డీవోకు విన్నవించారు.ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ,డీఎస్పీ జిల్లా స్టీరింగ్ కమిటీ మెంబర్ ఆవునూరు సతీష్, మాజీ ఎంపీటీసీ మైలారం నారాయణ,ఉపసర్పంచ్ ముద్దసా సంతోష్,శ్రీనివాస్ ,వార్డ్ మెంబర్లు,తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించారు. మొత్తం 225 అర్జీలు రాగా, సంబంధిత అధికారులకు అందజేశారు. చేనేత జౌళి శాఖ, సీ సెక్షన్ సూపరింటెండెంట్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, పౌర సరఫరాల శాఖ అధికారి, జిల్లా వైద్యాధికారి, మైనింగ్ శాఖ అధికారి, ఈఈ పీఆర్, జిల్లా ఎక్సైజ్ అధికారి, ఎస్సీ సంక్షేమ శాఖ, ఈడీఎం, నీటి పారుదల శాఖ, ఎంపిడిఓ ఇల్లంతకుంట, తహసీల్దార్ ఆఫీస్ గంభీరావుపేట, తహసీల్దార్ ఆఫీస్ వీర్నపల్లికి ఒకటి చొప్పున వచ్చాయి. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, డీ సెక్షన్ సూపరింటెండెంట్, డీఆర్డీఓ, ఎంపీడీఓ చందుర్తి, ఎంపీడీఓ వేములవాడ రూరల్, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, తహసీల్దార్ ఆఫీస్ బోయినపల్లి, ఎస్పీ కార్యాలయం, తహసీల్దార్ ఆఫీస్ ఎల్లారెడ్డిపేటకు 2 చొప్పున, తహసీల్దార్ ఆఫీస్ చందుర్తి, రుద్రంగి, సిరిసిల్ల, ఎస్డీసీకి 3 చొప్పున, ఎంపీడీఓ తంగళ్లపల్లి, తహసీల్దార్ ఆఫీస్ ముస్తాబాద్, తహసీల్దార్ ఆఫీస్ వేములవాడకు 4, జిల్లా సంక్షేమ శాఖ, సెస్ ఎండీ, ఎంపీడీఓ గంభీరావుపేట, కోనరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేటకు 5, తహసీల్దార్ ఆఫీస్ ఇల్లంతకుంటకు 6, తహసీల్దార్ ఆఫీస్ వేములవాడ రూరల్, విద్యా శాఖ, ఉపాధి కల్పన శాఖకు 7 చొప్పున, ఎంపీడీఓ వేములవాడ కు 8, గృహ నిర్మాణ శాఖ, తహసీల్దార్ ఆఫీస్ కోనరావుపేటకు 9, ఆర్డీఓ వేములవాడ, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం 10, తహసీల్దార్ ఆఫీస్ తంగళ్లపల్లికి 12, ఆర్డీఓ సిరిసిల్లకు 19, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల 35కు చొప్పున రాగా, సంబంధిత అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** కెసిఆర్ నాయకత్వంలో 2001 ఏప్రిల్ 27న పుట్టిన టిఆర్ఎస్ నాలుగేండ్ల కిందట భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) గా రూపాంతరం చెంది నేటికీ 25 ఏండ్లు పూర్తి చేసుకుని 26వ ఏట అడుగుడుతున్న వేల జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బి ఆర్ ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రంలో బిఆ ఎస్ సీనియర్ నాయకులు జెండా ఆవిష్కరణ చేయడంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ శాఖ అధ్యక్షుల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పార్టీ జెండాను ఆవిష్కరించి పార్టీ స్థాపకుల సేవలను సాధించుకున్నారు.అనంతరం సీట్లు పంపిణీ చేశారు.తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీ బిఆర్ఎస్ అని వారన్నారు .ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో టిఆర్ఎస్ పార్టీ పోషించిన పాత్రను గుర్తు చేశారు .పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిందన్నారు.రాష్ట్ర అభివృద్ధిలో పార్టీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కెసిఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని ఆయన పాలనలో తెలంగాణ సంక్షేమం అభివృద్ధి దేశానికే ఆదర్శమైందని పేర్కొన్నారు.పార్టీ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ,కెసిఆర్ నాయకత్వంలో కార్యకర్తల త్యాగాలు ప్రజల ఆశీర్వాదంతో బిఆర్ఎస్పార్టీ మరింత బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ప్రజల ఆకాంక్షతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో సాగాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోస్కుల జలంధర్ ,పిఎసిఎస్ మాజీ చైర్మన్ రాజా సుమన్ రావు ,ఆవుల సత్యం ,కాంపల్లి హన్మాండ్లు,కనుకుట్ల లింగారెడ్డి,బొల్లం రమేష్ ,మారం రాజశేఖర్,కోమల్ల జలంధర్,గ్రామ శాఖ అధ్యక్షులు ,నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** భారతీయ రాష్ట్ర సమితి పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల వ్యాప్తంగా అన్ని గ్రా మాలలో బిఆర్ఎస్ నాయకులు సోమవా రం ఘనంగా జరుపుకున్నారు.ఈ మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బండి లింగస్వామి గౌడ్, జెండాను ఆవిష్కరించి వేడుకలు జరిపారు. అదేవిధంగా రాఘవపేట గ్రామంలో గ్రా మ సర్పంచ్ పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ శాఖ అధ్యక్షుడు రాజ్ కుమార్ పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమలలో సర్పంచులు లక్ష్మ ణ్, తోట మా ధురి రాజారెడ్డి,లకావత్ కాంతి జవహర్లాల్, మాజీ జెడ్పిటిసి సంధి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం /పెగడపల్లి :** భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెగడపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద సోమవారం సంబరాలు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలకు పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ వివిధ విభాగాల నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను జగిత్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అనంతరం సీట్లు పంపిణీ చేశారు. అనంతరం వసంత మాట్లాడుతూ ఎన్నో కుట్రలు కుతంత్రాలను ఎదుర్కొని తెలంగాణరాష్ట్ర ప్రజలందరినీ ఏకం చేసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఆలాగేఎమ్మెల్సీ ఎల్ రమణ , మాజీ మంత్రి జీవన్ రెడ్డి నివాసాల్లోబి ఆర్ ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు.జగిత్యాల రూరల్ మండలం సోమన్ పెల్లిలో సర్పంచ్ చెవుల గంగన్న ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొనె మల్లేశం,నాయకులు ఎర్ర గంగా సాగర్, గొనె గంగాధర్,గొంటి మొగిలి,తదితరులు ఉన్నారు.

## సేంద్రియ పద్ధతుల ద్వారా వ్యవసాయం లాభదాయకం

**ప్రజాపక్షం /ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలం, మొహినికుంట గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతల అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించరు. డా. జి. ప్రియదర్శిని, అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు ఎం. సంధ్యా, టీచింగ్ అసోసియేట్ ఆరు ముఖ్య అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ యూరియా వాడకం, సాగు ఖర్చులు తగ్గించడం, నేల ఆరోగ్యాన్ని కాపాడడం, పంట మార్పిడి పాటించడం, సాగు నీటి ఆదా, సేంద్రియ పద్ధతుల ప్రోత్సాహం వంటి అంశాలను సవివరంగా వివరించారు.

### వ్యవసాయ అధికారి ఎఒ అనుషా

వ్యవసాయానికి సంబంధించిన ప్రభుత్వ సబ్సిడీలు, పథకాలు మరియు వాటి ద్వారా లభించే ప్రయోజనాలపై రైతులకు సమగ్రంగా వివరించారు. రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ క్లస్టర్ అధికారి డి. హరీష్పంటల విభిన్నీకరణలో భాగంగా ఆయిల్ పామ్ సాగు ప్రాముఖ్యతను వివరించి, దీని ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని తెలియజేశారు. విద్యార్థులు ఐ. అక్షర మరియు పి. శ్రీధర్ గ వర్మీ కంపోస్టింగ్పై అవగాహన కల్పించి, సేంద్రియ ఎరువుల తయారీ విధానం మరియు ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి. మురళి కూడా పాల్గొని, రైతులు ఈ కార్యక్రమం ద్వారా కొత్త పద్ధతులను అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సుమారు 50 మంది రైతులు హాజరై, కార్యక్రమంపై సానుకూలంగా స్పందించారు. రైతులు తమ అభిప్రాయాలు, ఆశలు తెలియజేసి, మరింత అభివృద్ధి కోసం సూచనలు కూడా చేశారు. కార్యక్రమం రైతులలో చైతన్యం పెంచడంలో ముఖ్య పాత్ర పోషించిందని నిర్వాహకులు తెలిపారు.

## యువత విద్యతోనే లక్ష్యం సాధించాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** నేటి యువత విద్యతోనే తమ లక్ష్యాన్ని సాధించి దేశానికి, కని పెంచిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎస్ ఐ ఓ జాతీయ అధ్యక్షులు అబ్దుల్ హాఫీజ్ అన్నారు.ఆదివారం రోజున స్థానిక ఎంబి గార్డెన్ లో ఎస్ ఐ ఓ జిల్లాస్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జమాతే ఇస్లామీ హింద్ తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ ఎస్ అమీనుల్ హసన్, ఎస్ ఐ ఓ తెలంగాణ అధ్యక్షులు ఫరాజ్ అహ్మద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ప్రస్తుత కాలంలో యువత అనేక సవాళ్లను ఎదుర్కొంటోందనీ ,విద్యలో వెనుకబడటం, జీవితంలో స్పష్టమైన లక్ష్యం లేకపోవడం, నిరుద్యోగ భయం, సోషల్ మీడియా దుర్వినియోగం, సరైన మార్గదర్శకత్వం లేక చాలామంది యువత దారి తప్పుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కాన్ఫరెన్స్ ద్వారా యువతకు దిశానిర్దేశం చేస్తూ, విద్య, లక్ష్య సాధన, నైతిక విలువలు మరియు సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించి వారిలో మనోధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో జమాఅత్ఎఇస్లామీ హింద్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై జావీద్ ,యూనిట్ అధ్యక్షుడు ఎం.ఏ. మొయిూద్ ,పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ముజైఫ్ ఉద్దీన్ , సయ్యద్ హబీబ్ ఉల్లా మస్రత్ , ఎం.ఏ. ముస్తాక్ అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణ

### జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కె.శ్రీధర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఏప్రిల్ 30న గురువారం రోజున ఉదయం 11 గంటలకు జిల్లా ఆసుపత్రి పెద్దపల్లి, నంది మేడారం సామాజిక ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని,ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న 3 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (పీడియాట్రీషియన్ జిల్లా ఆస్పత్రి పెద్దపల్లి నందు, సామాజిక ఆసుపత్రి నంది మేడారం) పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఏప్రిల్ 30న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని అన్నారు.ఆసక్తి గల వైద్యులు తమ యొక్క దరఖాస్తు బయోడేటా తో పాటు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్ల తో పాటు జిరాక్స్ ప్రతులు ఒక సెట్ తో హాజరు కావాలని, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నెలకు లక్ష రూపాయలు వేతనం ఉంటుందని , ఇతర వివరాలకు 8499061999, 9492457809 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని హిందూ ఐక్యవేదిక డిమాండ్

**ప్రజాపక్షం /పెగడపల్లి :** గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరుతూ దేశవ్యాప్త హిందూ ఐక్యవేదిక పిలుపు మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో హిందూ ఐక్యవేదిక నాయకులు తహశీల్దార్ కు వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హిందువులు ఆరాధ్య దైవంగా పూజించే గోవును రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గో ఆరాధనా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామని, గోసంతతిని కాపాడాలంటే వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోవును జాతీయ జంతువుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.గోమాత పట్ల భక్తి భావాన్ని చాటుతూ ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక ముఖ్య నాయకులు కాటం నరసింహారెడ్డి, మసూరి పార్థసారధి, సిరిపురం రవి, ఉల్లెందుల రాజశేఖర్, జడల రాజేశం,అంజి, శ్రీనివాస్,తిరుమల్, తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో మైనర్ల పట్టివేత

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో ఈనెల 26న అర్ధరాత్రి రాపర్తి ప్రభాకర్ ఇంటిలో చోరీకి పాల్పడ్డ ఇరువురు మైనర్లను పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు.ఎస్సై గురుక మహేష్ వివరాల ప్రకారం ధర్మపురి పట్టణానికి చెందిన రాపర్తి ప్రభాకర్ హైదరాబాద్ లోని బందువుల ఇంట్లో వేడుకకై ఈనెల 24న తన ఇంటికి తాళం వేసి వెళ్ళాడు.తిరిగి 26న ఇంటికి తిరిగి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది.ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచిన పావుతులం బంగారు కమ్మలు,15 తులాల వెండిపట్టీలు,రూ.4500 నగదు చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేసుకున్న ఎస్సై మహేష్ పోలీస్ సిబ్బందితో 24 గంటలలోపు దొంగతనానికి పాల్పడిన ఇరువురు నిందితులను పట్టుకున్నారు.నిందితులు మైనార్లు కావడంతో జువైనల్ జడ్జి ముందు ప్రవేశపెట్టి జువైనల్ హోమ్ కి తరలించినట్లు ఎస్సై జి.మహేష్ తెలిపారు.చోరీ కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్సై మహేష్ ను సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన తహసీల్దార్

**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండ లం చీకుడు గ్రామంలో వరి ధాన్యం కొనుగో లు కేంద్రాలను సోమవారం తహసిల్దార్ ఫరూ క్ సర్పంచ్ బొమ్మెన ఆంజనేయులు తో సందర్శించారు. వరి ధాన్యం నాణ్యత తేమశాతం కొనుగోలు ప్రక్రియ పరిశీలించారు. త్రాగునీ రు ఇతర సౌకర్యాలు కల్పించాలని రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందిని సూ చించారు. కార్యక్రమంలో ఆర్ ఐ రఘు, గ్రా మ రైతులు తదితరులు ఉన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని తరిమికొడతాం

### మాజీ మంత్రి జోగు రామన్న



**ప్రజాపక్షం/ మావలః** తెలంగాణపై కుట్రలు పన్నుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగడతామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన జెండాను ఆవిష్కరించి, తెలంగాలణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేశారు.తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బ తీసేందుకు మోదీ, రేవంత్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంతో సాధించుకున్న రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి నేడు దేశానికి ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అజయ్, ఇజ్జగిరి నారాయణ, దాసరి రమేష్, మెట్టు ప్రహ్లద్, గంద్రత్ రమేష్, యూనిస్ అక్బానీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బంజపల్లిలో కుస్తీ పోటీలు

### హాజరైన డీసీసీ చైర్మెన



**ప్రజాపక్షం/నిజాంసాగర్ః** నిజాంసాగర్ మండలకేంద్రంలోని బంజపల్లిలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కుస్తీపోటీలు నిర్వహించారు. ఈ కుస్తీపోటీలు గ్రామసర్పంచు ఏలే సుగుణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యువత, ఆయా గ్రామాల నుండి వచ్చిన మల్లయోధులు కుస్తీపోటీలో తలపడ్డారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు కేవలం నిజాంసాగర్ నుండే కాకుండా ఆయా మండలాల నుండి సైతం ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి తిలకించారు. గ్రామపెద్దలు, ప్రజలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు. కుస్తీపోటీల్లో గెలుపొందిన మల్లయోధునికి డీసీసీ చైర్మెన్ మల్లిఖార్జున్ నగదు బహుమతి అందించడంతో పాటు శాలువా, పూలమాలతో సత్కరించారు.

## వారసంతలో అంబలి పంపిణీ

**ప్రజాపక్షం / కౌటాల ః** కౌటాల మండల కేంద్రంలోని వారసంతలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో సోమవారం అంబలి పంపిణీ చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో సంతకు వచ్చే వృద్ధులు, మహిళలకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఎండల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంబలి పంపిణీ పట్ల సంతకు వచ్చిన జనం హర్షం వ్యక్తం చేశారు.

# వరి రైతుపై తెల్లకంకి భారం



**ప్రజాపక్షం / రెబ్బెన ః**ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో వరి సాగు చేసిన రైతులకు తెల్లకంకి రోగం శాపంగా మారింది. ఏసంగి సీజన్ లో సాగు చేసిన వరి పంట గొలుసు వేసే దశలో ఈ వ్యాధి సోకడంతో దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల్లో 30 నుంచి 40 శాతం మేర పంటకు నష్టం వాటిల్లిందని వారు వాపోతున్నారు. నాటు వేసిన మొదటి దశ నుంచి రకరకాల తెగుళ్ల ఆశించడంతో ఇప్పటికే పలుమార్లు మందులు పిచికారీ చేశామని, దీంతో పెట్టుబడి వ్యయం పెరిగిందని రైతులు తెలిపారు. తీరా పంట చేతికి వచ్చే సమయంలో తెల్లకంకి (కాండం తొలిచే పురుగు) ఆశించడంతో ఎకరానికి రావాల్సిన 100 బస్తాల దిగుబడి కాస్త 60 బస్తాలకు పడిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి రూ. 26 వేల నుంచి రూ. 30 వేల వరకు పెట్టుబడి పెట్టామని, ఎరువులు, పురుగుల మందుల కోసం మూడు నాలుగు సార్లు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయిందని చెబుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని, ప్రభుత్వం స్పందించి పంట నష్టం అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## భారీ వాహన డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన శిరీష

### అభినందించిన జిఎం..

### రాధాకృష్ణ వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం / మందమర్రి ః** మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా కాసిపేట02 గనిలో జనరల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. శిరీష భారీ వాహన డ్రైవింగ్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. రాజన్న సిరిసిల్లలోని తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్) లో 30 రోజుల పాటు నిర్వహించిన హెవీ మోటార్ వెహికల్ (హెచ్ఎంవి) శిక్షణలో ఆమె ప్రతిభ కనబరిచారు. శిక్షణ పూర్తి చేసిన సందర్భంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ తన కార్యాలయంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్యతో కలిసి శిరీషకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ మహిళలు సాధారణ విధులకే పరిమితం కాకుండా సాంకేతిక నైపుణ్యం కలిగిన రంగాల్లో ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, డిజిఎం పర్సనల్ అశోక్, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు, జిఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సివి రమణ, ఫిట్ సెక్రటరీ గీతిక, నాయకులు కంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై షీ టీం అవగాహన

### సిఐ సంతోష్ కుమార్ ఎస్ఐ చంద్రశేఖర్




**ప్రజాపక్షం / కౌటాల ః** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కౌటాల మండల కేంద్రంలో షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని కేబిఎన్ చౌక్, బస్టాండ్, మార్కెట్ ప్రాంతాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కౌటాల సిఐ సంతోష్ కుమార్, ఎస్సై చంద్రశేఖర్ పాల్గొని విద్యార్థులు, ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల భద్రత, బాలల రక్షణ, లింగ సమానత్వంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ వాటిని నివారించాలన్నారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ఆపద కలిగితే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ షీ టీం ఇన్‌చార్జ్ ఎఎస్ఐ డి సునీత, సభ్యులు రమాదేవి, శ్రీనివాస్, సునీత, స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తాగునీటి బోరుకు కొత్త మోటార్ ఏర్పాటు

**ప్రజాపక్షం / తిర్యాని ః** తిర్యాని మండలంలోని చింతపల్లి గ్రామంలో తాగునీటి బోరు మోటార్ చెడిపోవడంతో నెలకొన్న నీటి సమస్యను సర్పంచ్ కృష్ణ పరిష్కరించారు. గత కొన్ని రోజులుగా మోటార్ పని చేయక పోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించిన ఆయన వెంటనే స్పందించి నూతన సబ్‌మెర్సిబుల్ మోటార్‌ను కొనుగోలు చేయించారు. సోమవారం గ్రామస్తుల సమక్షంలో పాత మోటార్‌ను తొలగించి కొత్త మోటార్‌ను అమర్చారు. కొత్త మోటార్ ఏర్పాటు చేయడంతో గ్రామానికి తాగునీటి సరఫరా పునరుద్ధరణ అయింది. వేసవి కాలంలో నీటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే చర్యలు తీసుకున్న సర్పంచ్ కృష్ణకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



## ఉపాధి కూలీలకు చల్లని పానీయాల పంపిణీ

**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ ః** పెంచికల్‌పేట్ మండలంలోని ఎలుకపల్లి గ్రామంలో ఆదివారం ఉపాధి హామీ కూలీలకు సర్పంచ్ భక్తు రాంచందర్ చల్లని పానీయాలను పంపిణీ చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పని ప్రదేశంలో కూలీలకు ఉపశమనం కలిగించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన కూలీల సమస్యలను అడిగి తెలుసుకుని ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఉదయాన్నే పనికి వచ్చి త్వరగా పూర్తి చేసుకుని వెళ్లాలని కోరారు. పనిలో ఉన్న ప్రతి కూలీకి హాజరు తప్పనిసరిగా నమోదయ్యేలా చూడాలని, కూలీలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీశైలంను ఆదేశించారు.



## నిబంధనలు అతిక్రమిస్తే విత్తన డీలర్లపై కఠిన చర్యలు



**ప్రజాపక్షం/సిరికొండః** మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో విత్తన, ఎరువుల వ్యాపారులకు సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి తిరుమల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం లైసెన్స్ కలిగిన డీలర్లు మాత్రమే రైతులకు విత్తనాలు, ఎరువులు విక్రయించాలని స్పష్టం చేశారు. నాసిరకం ఉత్పత్తులు అమ్ముతూ రైతులకు మోసగిస్తే సంబంధిత డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తన కంపెనీలు తమ ఉత్పత్తులను సరఫరా చేసే ముందే లైసెన్స్ పొందిన డీలర్లకు తప్పనిసరిగా 'సోర్స్ సర్టిఫికెట్' అందజేయాలని సూచించారు. ఇది విత్తనాల నాణ్యతను నిర్ధానించడంలో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి జే. రమేష్, పోలీస్ విభాగానికి చెందిన బీ. ఈశ్వర్, వ్యవసాయ విస్తరణ అధికారులు, విత్తన వ్యాపారులు పాల్గొన్నారు.

## తలమడుగు మండలవ్యాప్తంగా బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు




**ప్రజాపక్షం/ తలమడుగుః** తలమడుగు మండల కేంద్రంతో పాటు బరంపూర్, ఆర్లి(కె), సుంకిడి, లింగి, కూచలపూర్, రూయ్యడి, ఝరి, దేవాపూర్, కజ్జర్ల తదితర గ్రామాల్లో భారత రాష్ట్ర సమితి 25వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. 2001 ఏప్రిల్ 27న తెలంగాణ అస్తిత్వ పతాకంగా ఆవిర్భవించిన ఈ పార్టీ, నేటితో విజయవంతంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. కజ్జర్ల గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మొట్టే కిరణ్ కుమార్ పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో బీఆర్ఎస్ చేసిన విశేష సేవలను స్మరించుకున్నారు. పార్టీ స్థాపన లక్ష్యాలు, రాష్ట్ర అభివృద్ధి పట్ల పార్టీకి ఉన్న కట్టుబాటును వివరించారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు సంకల్పబద్ధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో తలమడుగు మండల బీఆర్ఎస్ అధ్యక్షులు తోట వెంకటేష్, ఉపాధ్యక్షులు మగ్గిడి ప్రకాష్, కేదారేశ్వర్ రెడి, అబ్దుల్లా, రమాకాంత్, రంజిత్ రెడ్డి, సురేందర్ రెడ్డి, అభిరామ్ రెడ్డి, తోట శ్రీనివాస్, కార్తీక్ రెడ్డి, లక్ష్మణ్, వివిధ గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ అర్బన్ః** పట్టణంలోని విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్, మున్సిపల్ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 49వార్డుల్లో గుర్తించిన సమస్యలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా వీధి దీపాల థర్డ్ వైర్ల పునరుద్ధరణ, ప్రమాదకర స్తంభాల తొలగింపు, లూస్ వైర్ల సరిదిద్దడం వంటి పనులపై దృష్టి పెట్టాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఆయా సమస్యలపై అర్జీలు సమర్పించేందుకు ప్రజావాణికి తరలివచ్చే వారి కోసం సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా పులిహోర పంపిణీ చేశారు. వేసవి ఎండలు తీవ్రరూపం దాలుస్తున్న నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమానికి ప్రతి సోమవారం సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజల కోసం పులిహోర పంపిణీ కార్యక్రమం చేపట్టామని, ప్రతి సోమవారం దీనిని కొనసాగిస్తామని సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు తెలిపారు. కాగా రాజస్థానీ వాకర్స్ గ్రూప్ సౌజన్యంతో చల్లటి తాగునీటిని సమకూర్చారు. ఫోరం ప్రతినిధులను వాకర్స్ గ్రూప్ బాధ్యులను అదనపు కలెక్టర్ అభినందించారు. కలెక్టరేట్ ఏఓ ప్రశాంత్, సీనియర్ సిటిజన్స్ ఫోరం, వాకర్స్ గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సెన్సెస్ 2027 శిక్షణకు ముప్కాల్ మండలం



**ప్రజాపక్షం/ముప్కాల్ :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న దేశ జనాభా గణన 2027 లో భాగంగా ముప్కాల్ మండలంలో సోమవారం ఛార్జ్ ఆఫీసర్, తహసీల్దార్ ముంతాజ్ బుద్దీన్ అడిషనల్ ఛార్జీ ఆఫీసర్ విద్యాధికారి ఎం.గంగారాం ఆధ్వర్యంలో మాస్టర్ ట్రేనర్ ప్రవీన్‌రెడ్డి మల్లికార్జున్ ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు మూడు రోజుల శిక్షణ ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

### జాతీయ గోమాతగా ప్రకటించాలని తహసీల్దార్‌కు వినతి

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గోవులను సంరక్షించాలని కోరుతూ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. దేశవ్యాప్తంగా గో ఆరాధన ఉద్యమం కోసం సంతకాల సేకరణ చేసిన పత్రాలు రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్, సిఎంకు అందజేయాలన్నారు. రమణయ్య, రాజశేఖర్, నాగభూషణం, రామస్వామి, నరేందర్, గంగాధర్, ప్రవీన్, రవీందర్, గణేష్‌గుప్తా, భూపతి, శంకర్, అజయ్, రఘు, నవీన్, ధాత్రిక, రాజ్‌కుమార్, లక్ష్మీ పాల్గొన్నారు.

# ఇండ్ల గణనను విజయవంతం చేయాలి

**తహసీల్దార్ జె. తిరుపతి**



**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ :** మండలంలో నిర్వహిస్తున్న ఇండ్ల జాబితా, ఇండ్ల గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ జె తిరుపతి పిలుపునిచ్చారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇండ్ల గణన దేశ అభివృద్ధికి కీలకమని, ఈ ప్రక్రియ ద్వారా సేకరించే సమాచారం ఆధారంగానే ప్రభుత్వ పథకాలు అమలవుతాయని పేర్కొన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి కచ్చితమైన వివరాలను నమోదు చేయాలని సూచించారు. శిక్షణలో అందించిన మార్గదర్శకాలను పాటిస్తూ హెచ్‌ఎల్‌ఓ యాప్ వినియోగంపై నైపుణ్యం పెంపొందించుకోవాలని తెలిపారు. ఫీల్డ్‌లో ఎదురయ్యే సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ గణన ప్రాముఖ్యతను వివరించి వారి సహకారం పొందాలని, సమాచార గోప్యతను పాటించాలని ఆదేశించారు. బాధ్యతతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ట్రైనర్లు ఖమర్, రాజకమలాకర్ రెడ్డి, సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

# మే నుండి ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

**జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి**

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (SATS) మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లాలో మే 1వ తేది నుండి జూన్ 7వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన , క్రీడల శాఖ అధికారి బి.శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంత క్రీడాకారుల కోసం మొత్తం 20 శిబిరాలను (పట్టణ ప్రాంతాల్లో 10, గ్రామీణ ప్రాంతాల్లో 10) ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాలకు సంబంధించి నిర్మల్ మునిసిపాలిటి పరిధిలోని ఎన్టీఆర్ మిని స్టేడియంలో సెల్ఫ్ డిఫెన్స్ , కరాటే , సాఫ్ట్‌బాల్ , యోగా, వాలీబాల్ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే భైంసా, ఖానాపూర్‌లో వాలీబాల్ , కరాటే, యోగా అంశాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో మస్కాపూర్ టెన్నిస్‌వెయిట్ లిఫ్టింగ్, వడ్యాల్ లో సాఫ్ట్‌బాల్, సోన్ ఖోఖో, చించోలిబి హాకీ, తల్వేద సెల్ఫ్ డిఫెన్స్, దిలావర్‌పూర్ ఫుట్‌బాల్, బీరవెల్లి నెట్‌బాల్, నర్సాపూర్‌జి మరియు లోకేశ్వరం తండా వాలీబాల్ కేంద్రాల్లో శిక్షణ ఇవ్వబడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ ఉచితంగా ఉంటుందని పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారులు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వెబ్‌సైట్ https://satgsc.telangana.gov.in ద్వారా నిర్ణీత రుసుము చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9515652849 నెంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు. ఈ శిబిరాల ద్వారా విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచడంతో పాటు వారి నైపుణ్యాలను మెరుగుపర్చడమే లక్ష్యమని ఆయన వివరించారు.

## నిర్మల్ జిల్లా ఆప్ అధికారిక ప్రతినిధిగా పాముల వసంతరావు



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** ఆమ్ ఆద్మీ పార్టీ నిర్మల్ జిల్లా అధికారిక ప్రతినిధిగా పాముల వసంతరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సయ్యద్ హైదర్ ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడటానికి వసంతరావు సేవలు ఎంతో దోహదపడతాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. నిర్మల్ నియోజకవర్గ వ్యాప్తంగా ఆమ్ ఆద్మీ పార్టీ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని సయ్యద్ హైదర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించినందుకు వసంతరావు పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వసంతరావు నియామకం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ బి.శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ వినోద్ కుమార్ , అబ్దుల్ సాదిక్, ట్రెజరర్ అరవింద్ మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొని జిల్లాలో పార్టీ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేస్తామని ప్రకటించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి, మంత్రుల సమీక్ష

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిపై రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరియు జూపల్లి కృష్ణారావు గారు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించ్చరు. హిమాయత్ నగర్‌లోని హౌజింగ్ కార్పోరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లాలో ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం ఉన్న పరిస్థితులను, ఎదురవుతున్న అడ్డంకులను మంత్రులు క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. పేదల సొంతింటి కల సాకారం కావాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు ప్రజా ప్రతినిధుల సమన్వయంతో పనిచేస్తూ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని వారు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపిలు నగేష్ మరియు గడ్డం వంశీతో పాటు ఎం.ఎల్‌సిలు దండే విఠల్ , అంజరెడ్డి పాల్గొన్నారు. అలాగే ఎం.ఎల్.ఏ.లు ప్రేంసాగర్‌రావు, గడ్డం వినోద్, రామారావు పటేల్, పాయల శంకర్, వెడ్మ బొజ్జు, పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొని తమ ప్రాంతాల్లోని గృహ నిర్మాణ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రులు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమాశంలో రెవెన్యూ శాఖ స్పెషల్ సెక్రెటరీ లోకేష్ కుమార్, హౌజింగ్ కార్పోరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ విపి గౌతం లతో పాటు ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, కుమ్రం భీం, ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా , మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్లు తమ జిల్లాల్లో జరుగుతున్న పనుల వివరాలను నివేదించగా, వివిధ శాఖల ఉన్నతాధికారులు కూడా ఈ చర్చల్లో భాగస్వాములయ్యారు.

## కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఘనంగా వీడ్కోలు పలికిన మున్సిపల్ వైస్ చైర్మన్



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ అప్పాల గణేషవ చక్రవర్తి మరియు కౌన్సిలర్లు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా అందించిన సేవలను గుర్తు చేస్తూ ఆమెను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వైస్ చైర్మన్ గణేష్ చక్రవర్తి మాట్లాడుతూ, కలెక్టర్ అభిలాష అభినవ్ తన పదవీ కాలంలో నిర్మల్ పట్టణ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆమె పనితీరు మరియు సేవా దృక్పథం తమకు స్ఫూర్తిదాయకమని , రానున్న రోజుల్లో ఆమెను స్ఫూర్తిగా తీసుకొని నిర్మల్ పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆమె భవిష్యత్ పయనం విజయవంతంగా సాగాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కత్తి నరేందర్, ఎన్‌పి.రాజు, గోపు గోపి, పెండం శ్రీనివాస్, శెనిగారపు నరేష్, గుంజాల చైతన్య, ఆకుల రామకృష్ణ , లక్కాకుల హరీష్, మాజీ కౌన్సిలర్ ధర్మాజీ శ్రీనివాస్, తారక రఘు, నాయకులు సిరికొండ శ్రీనివాస్, ఆడప శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**మార్కెట్ కమిటీ చైర్మెన్ భీం రెడ్డి**



**ప్రజాపక్షం / మామడ :** రైతులు దళారులకు తక్కువ ధరకు ధాన్యం అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని లబ్ది పొందాలని నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ భీం రెడ్డి అన్నారు. సోమవారం మామడ మండలంలోని న్యూ స్కాంగ్వి ఆదర్శనగర్ గ్రామంల్లో పి.ఏ.సి.ఎస్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకొని క్వింటాలుకు 2389 రూపాయల మద్దతు ధర పొందాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అశ్విన్‌రెడ్డి, ముత్యం రెడ్డి, లక్ష్మీ, ఏ.ఎం.సి. డైరెక్టర్ వకీల్, పి.ఏ.సి.ఎస్., సి.ఇ.ఓ. రాజేందర్, నాయకులు గంగారెడ్డి, వికాస్ రెడ్డి ప్రశాంత్, లింగారెడ్డి, నితిన్‌రెడ్డి, భోజన్న, రవి రైతులు పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

**ప్రజాపక్షం / కుంటాల :** గంజాయి రహిత సమాజం లక్ష్యంగా అందరూ కృషి చేయాలని ఎస్.ఐ. అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని వెంకూర్ గ్రామంలో జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు గాంజ గస్తీ అవగాహన కార్యక్రమంలో గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. ప్రధానంగా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అలవాటు పడకూడదన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. గంజాయి సాగు, వినియోగం, రవాణాకు పాల్పడితే తీవ్రమైన శిక్షలు అనుభవించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## గోహత్యను ఆపాలి



**ప్రజాపక్షం/బాల్కొండ:** గోవులను జాతీయ జంతువుగా ప్రకటించి గోహత్యను నిరోధించటానికి దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, రాజేష్, రాజేశ్వర్, నరేందర్, నవీన్, పవన్, రాజు పాల్గొన్నారు.

## ప్రారంభమైన గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని అంబం(వై) గ్రామంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గంగాదేవి దేవతా విగ్రహ ప్రతిష్టాపనతో పాటు భక్తి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు గంగపుత్ర సంఘం సభ్యులు తెలిపారు. సోమవారం గంగాదేవి దేవతా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా మొదటి రోజున గంగాదేవి అమ్మవారి విగ్రహాన్ని అంబం గ్రామంలోని ప్రధాన వీధులలో మహిళలు గ్రామస్తులు మంగళహారాతులతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం యాగశాల ప్రవేశం, అఖండ దేవారాధన, అంకురార్పణ, గణపతి పూజ, పుష్పవనం, నాంది, శక్తి ప్రతిష్ట, అవన్నీత, దేవతవనం, జలాభివనం, అవనిత, దేవతార్చన, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను గ్రామ గంగపుత్ర సంఘం పెద్దలతో పాటు మహిళలు యువత, గ్రామ పెద్దలు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధాన వీధులలో శోభా యాత్రానంతరం అమ్మవారి విగ్రహంతో పాటు మహిళా భక్తులు గంగమ్మ దేవి ఆలయానికి చేరుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బోయిడి లక్ష్మణ్, సర్పంచ్ గోపరి స్రవంతి సుమన్, మాజీ ఎంపీపీ కొండేగల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాజుగొల్లా రాజయ్య, కార్యదర్శి బోయి అబ్బయ్య, ఉప సర్పంచ్ కొండేగల కాకయ్య, మెంబర్స్ బోయి రమేష్, నాగం లక్ష్మణ్, బోయి చిన్న లక్ష్మణ్, మంగలి సతీష్, సంగం సభ్యులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**ప్రజాపక్షం / బోథ్ :** ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పడుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని ఎంపిడిఓ రమేష్ అన్నారు. సోమవారం బోథ్ మండలం కౌటబి గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన విద్యాఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపిడిఓ రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కౌటబి, గ్రామానికి చెందిన సైబర్ సెక్యూరిటీ వింగ్‌లో ఏ.ఎస్.ఐ.గా విధులు నిర్వహిస్తున్న బొమ్మకంటి సురేందర్ సామాజిక బాధ్యతగా తన గ్రామానికి చెందిన నిరుద్యోగ యువతకు అండగా నిలవడం సంతోషదాయకమని అన్నారు. యువత చెడు వ్యసనాల జోలికి వెళ్ళకుండా ఒక లక్ష్యాన్ని విధించుకొని లక్ష్య సాధన దిశగా నిరంతరం శ్రమించాలని అన్నారు. కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం వచ్చి మూడు తరాలు మారిపోతాయని అన్నారు. చిన్న చిన్న ఓటములకు కుంగిపోవద్దని విజయం సాధించే వరకు అఉలుపెరుగని కృషి చేయాలని సూచించారు. నైపుణ్యాలు ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని ఆయన అన్నారు. గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు తమ వంతు సహాయ సహాకారాలు అందిస్తానని అన్నారు. అనంతరం బొమ్మకంటి సురేందర్ మాట్లాడుతూ పుట్టిన గ్రామానికి తన వంతుగా ఏదో ఒకటి చేయాలనే తపనతో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు ఉపయోగపడే మెటీరియల్‌ను పంపిణీ చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సామాజిక కార్యక్రమాలను చేపడతానని అన్నారు. గ్రామాభివృద్ధి కోసం తన వంతు పూర్తి సహాకారం ఉంటుందని అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ



బ్యూరోలో పనిచేస్తున్న ఆయన సైబర్ నేరాలపై యువతకు అవగాహన కల్పించారు. యువత ఆన్‌లైన్ గేమ్స్ లకు బానిస కావద్దని వాటితో కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌లకు స్పందించి తమ వ్యక్తిగత వివరాలను చెప్పవద్దని సూచించారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వాళ్ళాని గుడ్డిగా నమ్మి వాళ్ళు చెప్పినట్లు చేయవద్దని అన్నారు. ఒక వేళ సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 కాల్ చేయాలని సూచించారు. అనంతరం పోటీ పరీక్షల నిపుణులు బద్దం పురుషోత్తం రెడ్డి, అల్లం సాయి కృష్ణ లు ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఓరుగంటి సామి, ఉప సర్పంచ్ ఇట్టేడి రమణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి షకీల్, విడిసి అధ్యక్షులు పిడిగు అశోక్ రెడ్డి, లింగం పల్లి సంతోష్ అబ్దుల్ దావుఫ్ వెండి సోమేష్ వెండి పృథ్వీ రాజు, రమణ గౌడు, లతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, వివిధ పార్టీల నాయకులు యువజన సంఘాల సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

# జనగణన స్వీయ నమోదు చేసుకున్న జిల్లా అధికారులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జనగణనలో భాగంగా వివిధ జిల్లా శాఖల అధికారులు స్వీయగణనలో పాల్గొన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో సోమవార ం ప్రజావాణిలో అధికారులు పాల్గొన్న సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ స్వీయగణన ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు అధికారులు తమ స్మార్ట్ ఫోన్లను వినియోగిస్తూ ఆన్‌లైన్ వెబ్‌సైట్ https://se.census.gov.inద్వారా తన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అయ్యేలా చూడాలన్నారు. ప్రతి నివాస ప్రాంతంలో స్వీయ గణనపై అవగాహన కల్పించాలని ప్రతి కుటుంబం జనగణనలో స్వీయ నమోదు చేసుకు



నేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈనెల 26న ప్రారంభమైన స్వీయగణన ప్రక్రియ మే 10 వరకు కొనసాగుతుందని గడువులోగా ప్రజలు స్వీయ నమోదు చేసుకోవాలని సూచించారు.

# టీబీ రహిత గ్రామ పంచాయతీగా ఠాణాకలాన్‌కు కాంస్య పతకం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** క్షయ(టిబి) నిర్మూలనలో విశేష కృషి చేసినందుకు గాను నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామ పంచాయతీ జిల్లా స్థాయిలో టిబి రహిత గ్రామ పంచాయతీ పురస్కారానికి ఎంపికైంది. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ గెంటి అలేఖ్య శ్రీనివాస్ ఈ కాంస్య పతాకాన్ని అందుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 517గ్రామ పంచాయతీలు ఉండగా కేవలం 18గ్రామ పంచాయతీలు మాత్రమే ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికయ్యాయి. ఎడపల్లి మండలం మొత్తంలో ఠాణాకలాన్ గ్రామం ఒక్కటే ఈ అవార్డును దక్కించుకోవడం విశేషం. పురస్కారం అందుకున్న అనంతరం సర్పంచ్ గెంటి అలేఖ్య శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామంలో



క్షయ వ్యాధి పట్ల ప్రజలను చైతన్య పర్చడంలో, బాధితులకు మెరుగైన సేవలందించడంలో తమ గ్రామ ఆరోగ్య సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ఈ అవార్డు రావడానికి రాత్రింబవళ్లు కృషి చేసిన ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# స్వీయ గణనలో ప్రజలు అధికంగా పాల్గొనాలి

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** స్వీయ గణనలో ప్రజలు అధికంగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పిలుపునిచ్చారు. సమగ్ర జిల్లా కార్యాలయ సముదాయం (ఐడీఓసీ)లో సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మీడియా సమావేశం నిర్వహించి సెన్సస్ 2027, యాసంగి ధాన్యం కొనుగోలు, విద్యా రంగ సంస్కరణలపై సమగ్రంగా వివరించారు.ఈ సందర్భంగా 1881 సంవత్సరం నుండి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి సెన్సస్ నిర్వహించబడుతోందని, కోవిడ్ కారణంగా ఆలస్యమైనప్పటికి ఇప్పుడు 16వ జన గణన చేపడుతున్నామని తెలిపారు.సర్వేలకు భిన్నంగా సెన్సస్ చట్టబద్ధంగా నిర్వహించబడే ప్రక్రియ అని, ఇందులో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలను ఇవ్వాలని, ఎవరూ సమాచారం దాచకూడదని స్పష్టం చేశారు. జనగణన రెండు దశల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. మే 11 నుండి జూన్ 9 వరకు మొదటి దశగా హౌస్ లిస్టింగ్ చేపట్టి ఇళ్లకు సంబంధించిన 33 ప్రశ్నలపై వివరాలు సేకరిస్తామని చెప్పారు. ఇందులో నీటి కనెక్షన్, మరుగుదొడ్డి, గ్యాస్ కనెక్షన్, ఫోన్, ఇంటర్నెట్, తరచుగా వినియోగించే ఆహార ధాన్యాలు వంటి అంశాలు నమోదు చేస్తారని మొత్తం 33 ప్రశ్నల ద్వారా గృహ వివరాలు సేకరించి డిజిటల్‌గా భద్రపరుస్తామని పేర్కొన్నారు.రెండో దశగా 2027 ఫిబ్రవరి మార్చి నెలల్లో జనాభా గణన నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయడంతో ఇకపై మాన్యువల్ ట్రక్ షీట్ ఉండదని స్పష్టం చేశారు.రాబోయే రెండు రోజుల్లో కొనుగోలు వేగం పెరుగుతుందని, రోజుకు 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. గతంలో ఒక రోజులో 19 వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు. వేసవి తీవ్రత కారణంగా హమాలీల లోడింగ్ సమస్యలు ఉన్నప్పటికీ అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.ధాన్యాన్ని 112 రైస్ మిల్లులకు కేటాయించినట్లు తెలిపారు. సీఎంఆర్ బియ్యం డెలివరీలో 202425 ఖరీఫ్ 100 శాతం, రబీ 93 శాతం, 202526 ఖరీఫ్ 36 శాతం పూర్తయ్యిందని తెలిపారు. సీఎంఆర్ డెలివరీలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో సీనియర్ ఉపాధ్యాయులతో ప్యానెల్ ఏర్పాటు చేసి ప్రతి తరగతిని పరిశీలించి ఉపాధ్యాయులకు వ్యక్తిగతంగా సూచనలు ఇస్తున్నామని చెప్పారు.అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు.ఈ సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్,ఈడిఎం కవిత సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

# ఎడపల్లి శివారులో బోరు బావుల వద్ద వైర్ల చోరీ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రం శివారులోని వ్యవసాయ బోర్ల వైర్లను ట్రాన్స్ ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తూ చోరికి పాల్పడుతున్నారని ఆ గ్రామ రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో గ్రామ శివారులో గల ట్రాన్స్ ఫార్మర్లను, ప్రస్తుతం సుమారు 30బోరు బావుల వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీనిపై ఎడపల్లి పోలీసులకు రైతులు ఫిర్యాదు చేయడంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. గత కొద్ది కాలంగా గుర్తు తెలియని వ్యక్తులు రెచ్చిపోతూ చోరికి పాల్పడుతున్నారని ముఖ్యంగా తమ వ్యవసాయ భూములను బోరు బావుల కింద ఉన్నాయని అన్నారు. కొందరు వ్యక్తులు ట్రాన్స్ ఫార్మర్ల కాయలు దొంగతనం చేయడమే కాకుండా బోరు మోటార్ల వైర్లను కూడా దొంగిలిస్తూ ఉండటంతో పంట పొలాలకు నీటిని అందివ్వడం కష్టంగా మారిందని దీంతో పంటలు పండలేని పరిస్థితికి చేరుకుంటున్నాయని వాపోయారు. చోరికి పాల్పడుతున్న వ్యక్తులను వెంటనే పట్టుకొని శిక్షించాలని కోరారు. రాత్రి సమయాల్లో అనుమానస్పదంగా తిరిగే వారిని అదుపులోకి తీసుకోవాలని కోరారు.



# గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి

## తహసీల్దార్ కార్యాలయంలో వినతి

**ప్రజాపక్షం/ఎడపల్లి:** గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని, ఆవుల సంరక్షణ కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఎడపల్లి సర్పంచ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కందగట్ల రాంచందర్, హిందూధర్మ పరిరక్షణ సమితి అధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాంచందర్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో, హిందూ ధర్మంలో గోమాతకు అత్యున్నత స్థానం ఉందని పేర్కొన్నారు. గోవులను కేవలం జంతువులుగా కాకుండా దేవతగా భావించి పూజించే సంప్రదాయం మనదని, అటువంటి గోమాతను గౌరవిస్తూ కేంద్ర, రాష్ట్ర స్థాయిలో మంత్రిత్వ శాఖలను ఏర్పాటు చేయాలని అన్నారు. దేశవ్యాప్తంగా కఠినమైన గోవధ నిషేద చట్టాలను అమలు చేయాలని కోరారు. హిందూధర్మ పరిరక్షణ సమితి ప్రతినిధులు మాట్లాడుతూ.. గోవుల వల్ల కలిగే ఆధ్యాత్మిక, ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని వారు కోరారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



# ఘనంగా బిఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ గుడిసెల సంధ్యారాణి రాజ రమేష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాధనే లక్ష్యంగా కల్వకుంట్ల చంద్రశేఖర రావు స్థాపించిన పార్టీ అంచెలంచెలుగా ఎదిగి దేశ రాజధాని ఢిల్లీ వరకు విస్తరించిందని కొనియాడారు. ప్రాణాలకు తెగించి పోరాడి అందరినీ మెప్పించి స్వరాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందని పేర్కొన్నారు. పట్టణ నాయకులు సుదర్శన్, రామిడి కుమార్, కౌన్సిలర్లు శశి కుమార్, శ్రీనివాస్, బొమ్మ భూమయ్య, రాజశేఖర్, సంధ్య రాణి, లక్ష్మి, రామిడి లక్ష్మీ కాంత్, డబ్బేటి సంతోష్ పాల్గొన్నారు.



**కాగజ్ నగర్ :** కాగజ్‌నగర్ పట్టణంలో బిఆర్‌ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పాల్గొని గులాబీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో బిఆర్‌ఎస్ పార్టీది కీలక పాత్ర అని కొనియాడారు. ఉద్యమ సమయంలో నాయకులు, కార్యకర్తలు చేసిన త్యాగాలు మరువలేనివని, రాష్ట్ర అభివృద్ధికి పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులు, పలువురు స్థానిక నాయకులు, యువ నాయకులు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.



**రెబ్బెన :** రెబ్బెన మండలంలోని రోళ్ళపహాడ్ గ్రామంలో బిఆర్‌ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల రాజేష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆరు దశాబ్దాల తెలంగాణ అస్తిత్వ పోరాటాన్ని గమ్యానికి చేర్చిన ఘనత బిఆర్‌ఎస్ పార్టీదేనని కొనియాడారు. 2001లో ప్రారంభమైన గులాబీ జెండా ప్రస్థానం నేడు 26వ పడిలోకి అడుగుపెట్టడం సంతోషకరమని, ప్రజల గుండె ధైర్యంగా ఈ పార్టీ నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడే చిన్నయ్య, మాజీ ఉప సర్పంచ్ కొడిపె వెంకటేష్, బిఆర్ఎస్ పార్టీ యూత్ లీడర్ రెబ్బెన సుధాకర్, మడే అజయ్ తదితరులు పాల్గొన్నారు.



**కౌటాల :** కౌటాల మండల కేంద్రంలోని కొమరం భీం చౌరస్తా వద్ద బిఆర్‌ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాధనలో పార్టీ పాత్రను స్మరించుకుంటూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ ఉద్యమకారులు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



**పెంచికల్‌పేట్ :** పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో బిఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు బిట్టి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు చౌదరి తిరుపతి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి సంబరాలు జరుపుకున్నారు. బిఆర్‌ఎస్ పార్టీ 25 ఏళ్లు పూర్తి చేసుకుందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. రాష్ట్ర పునర్నిర్మాణం, అభివృద్ధికి బిఆర్‌ఎస్ పార్టీ శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పోర్తేటి వెంకటేష్, జాజిమొగ్గ శ్రీనివాస్, మాజీ సర్పంచులు ఉపాసి సంజీవ్, పాలే సుధాకర్, మేకల ఇస్తారి, పొట్టే సత్యనారాయణ పాల్గొన్నారు. వీరితో పాటు నాయకులు ఆత్రం సిద్దు, కిరణ్, కైరత్, రాకేష్, నరేష్, షరీఫ్, వెంకటి, అంజన్న, సదాశివ, గోపాల్, రమేష్, యువకులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

**లోకేశ్వరం :** బి.ఆర్.ఎస్ పార్టీ ముథోల్ నియోజకవర్గం సమన్వయ సమితి సభ్యులు లోలం శ్యాం సుందర్ పిలుపు మేరకు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలోని బారాసా రాష్ట్ర సమితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అలాగే బామినికె గ్రామంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గులాబీ దళపతి తెలంగాణ తొలి సి.ఎం. నాయకత్వంలో 14 సంవత్సరాల పాటు మలిదశ ఉద్యమంలో స్వరాష్ట్ర కలను సాధించి పదేండ్ల పాలన గురించి అభివృద్ధి పనులు గురించి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ లీడర్ సుధాకర్ మాజీ ఉప సర్పంచ్ వినోద్ నాయకులు చింటు, రవి, నరేష్, సాయన్న, సంతోష్, సుమన్, మధు, ప్రశాంత్, మల్లేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.





**సారంగాపూర్ :** కాంగ్రెస్ పాలన పోవాలి కే.సి.ఆర్ రావాలి అనే నినాదంతో మండలంలో బి.ఆర్.ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలో గులాబి జెండాను ఎగురవేసి సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు దేవి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఇటు రైతులు, అటు నిరుపేదలు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పొంతన లేని పథకాలను ప్రారంభించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, గత కేసిఆర్ ప్రభుత్వంలో రైతులకు ఉచిత నిరంతర విద్యుత్తు సకాలంలో రైతుబంధు తదితర కార్యక్రమాలతో భారతదేశంలోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లక్ష్మీ నారాయణ గౌడ్ ఎదులాపురం ధనుంజయ్, లక్ష్మ ణ్, శ్రీధరవ, తదితరులు పాల్గొన్నారు.



**కమ్మర్‌పల్లి :** బీఆర్‌ఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో పార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేసి అమరులకు నివాళులర్పిస్తూ జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, గ్రామశాఖ అధ్యక్షులు కొంటికంటి నరేందర్, ఉపసర్పంచ్ కొత్తపెల్లి అశోక్, మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, మైనార్టీ మండల అధ్యక్షులు అహ్మద్, టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బద్దం రాజేశ్వర్, రెంజర్ల మహేందర్, తీగల హరీష్, కొత్తపల్లి రఘు, కిటక శ్రీను, తంబల రాకేష్, పత్రి శ్రావణ్, కోరి నర్సయ్య, సుంకరి మురళి, నాయకులు పాల్గొన్నారు.



**ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల పరిధిలోని మంగళ్‌పహాడ్ ఎక్స్ రోడ్ వద్ద భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దేరాడి శ్రీరామ్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేసిన అనంతరం నాయకులు, కార్యకర్తలు పార్టీకి మద్దతుగా నినాదాలు చేశారు. పార్టీ ఆవిర్భావం సందర్భంగా కేక్ కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని పండుగ వాతావరణాన్ని తలపించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు దేరాడి శ్రీరామ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బిఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడు ముందుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



**జమ్మికుంట:** భారత రాష్ట్ర సమితి 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణ పరిధిలోని 23, 12 వార్డులలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆనాడు కేసీఆర్ ఏర్పాటు చేసిన భారత రాష్ట్ర సమితి వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిందన్నారు. కెసిఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి జరిగిందని మళ్లీ కెసిఆర్ ముఖ్యమంత్రి అయితేనే అభివృద్ధి జరుగుతుందని ఆయన తెలిపారు. రానున్న రోజులో మరింత కష్టపడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజలకు భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చుంచూ రమాదేవి, వార్డు అధ్యక్షులు పసునూటి శ్రీకాంత్, నాగపురి శ్రీనివాస్, ఉడుత రమేష్, ఎండి.అమీర్, దేవరాజు నదీమ్, జాఫర్, నజీర్, ఖాజా, శివ తదితరులు పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని బిఆర్‌ఎస్ జిల్లా మరియు పట్టణ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్, జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ అమరవీరుల స్థూపం వద్ద తోట ఆగయ్య, జిందం చక్రపాణీలు బిఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి, చిక్కాల రామారావు, వైస్ ఛైర్మెన్ దార్ల సందీప్, నేలకొండ అరుణ రాఘవరెడ్డి, గూడూరి ప్రవీణ్, బుర్ర మల్లికార్జున్ గౌడ్,కౌన్సిలర్ సభ్యులు కో ఆప్షన్ సభ్యులు, ,మాజీ ప్రజా ప్రతినిధులు ముఖ్య నాయకులు, కార్యవర్గ సభ్యులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

